


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 153 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 14 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 153 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 14 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# ప్రభుత్వ పనితీరు ప్రజలకు క్షేత్రస్థాయిలో కనిపించాలి

## అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- పాఠశాలలు తెరిచే నాటికి సంక్షేమ హాస్టళ్లు పూర్తి వసతులతో సిద్ధం కావాలని సీఎం ఆదేశం
- పేదలు సంతృప్తిగా భోజనం చేసేలా అన్న క్యాంటీన్ల నిర్వహణ ఉండాలని స్పష్టీకరణ
- మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత, నేరగాళ్లలో భయం పుట్టించాలని సూచన
- ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందించేందుకు పైలట్ ప్రాజెక్టులు
- పట్టణ ప్రాంతాల్లోనూ జలధార కార్యక్రమం చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పరిపాలనను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు ముమ్మరం చేశారు. సోమవారం సచివాలయం లోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై క్షేత్రస్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, పట్టణాల్లో మౌలిక వసతులు, మహిళల భద్రత, అన్న క్యాంటీన్ల నిర్వహణతో పాటు పలు కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పనితీరు ప్రజలకు క్షేత్రస్థాయిలో కనిపించాలని, ఫిర్యాదులకు ఆస్కారం లేని పాలన అందించాలని ఆయన స్పష్టం చేశారు.

**పాఠశాలలు తెరిచేనాటికి హాస్టళ్లు సిద్ధం**

జూన్ నెలలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు పూర్తిస్థాయి వసతులతో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. హాస్టళ్లలో టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్లు వంటి మౌలిక

మిగతా 2లో



## హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

- 2026-27 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదు
- సాయంత్రం 4,381 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదు
- గ్రేటర్ చరిత్రలో 2026 మార్చి 3న 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగం

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ నగరంలో విద్యుత్ వినియోగం ఏప్రిల్ 13న రికార్డు స్థాయికి చేరుకుంది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ

మిగతా 2లో



## ఈ నెల 15న ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- ఈ నెల 15న ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- కొత్తగా 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు అందుబాటులోకి
- రాష్ట్రవ్యాప్తంగా 269కి పెరగనున్న క్యాంటీన్ల సంఖ్య
- ప్రస్తుతం 207 క్యాంటీన్ల ద్వారా 2.10 లక్షల మందికి భోజనం
- పేదలందరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల పథకాన్ని ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ధరణికోటలో ఏర్పాటు చేసిన నూతన అన్న క్యాంటీన్‌ను ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రారంభించనున్నారు. పేదలు, కార్మికులు, విద్యార్థులకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. 'అందరికీ ఆహార భద్రత' అనే నినాదంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజూ 2.10 లక్షల మందికి

మిగతా 2లో



## హర్మ్యూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు

- ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్న మహమ్మద్ ఫతాలీ
- తమ డిమాండ్లకు అమెరికా అంగీకరిస్తేనే చర్చలు అన్న ఫతాలీ
- ఇరాన్ సామర్థ్యం గురించి అమెరికాకు తెలుసని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:హర్మ్యూజ్ జలసంధి గుండా వెళుతున్న భారతీయ చమురు ట్యాంకర్ల నుంచి తాము ఎలాంటి టోల్ ఫీజును వసూలు చేయడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ రాయబారి

మిగతా 2లో

## ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజు

- శ్రీకాకుళం-తిరుపతి మధ్య తొలి రెగ్యులర్ రైలు సేవలు ప్రారంభం
- నెరవేరిన సిక్కోలు ప్రజల 75 ఏళ్ల చిరకాల స్వప్నం
- అరసవల్లిని తిరుమల పుణ్యక్షేత్రంతో అనుసంధానించనున్న హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా రైలుకు పచ్చజెండా
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి అని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:శ్రీకాకుళం జిల్లా ప్రజల 75 ఏళ్ల చిరకాల స్వప్నం నెరవేరింది. జిల్లా చరిత్రలో తొలిసారిగా తిరుపతికి నేరుగా వెళ్లే రెగ్యులర్ రైలు సేవలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం రోడ్ – తిరుపతి

మిగతా 2లో

## వివేకా హత్య కేసులో సునీత పిటిషన్

### కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి హైకోర్టు ఆదేశం

- వివేకా హత్య కేసుపై తెలంగాణ హైకోర్టులో విచారణ
- మరింత దర్యాప్తు కోరుతూ సునీతా రెడ్డి పిటిషన్
- కౌంటర్ దాఖలుకు రెండు వారాల సమయం కోరిన సీబీఐ
- ఈ నెల 27లోపు కౌంటర్ వేయాలని సీబీఐకి కోర్టు ఆదేశం



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఆయన కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం నాడు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందించేందుకు రెండు వారాల సమయం కావాలని సీబీఐ కోరగా,

మిగతా 2లో

## మంగ్లీ వర్సెస్ అడ్వకేట్ సుబ్బారావు పంజాగుట్ట పోలీసుల కీలక వివరణ

- ఫైనాన్స్ స్కామ్ కు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్న సీఐ
- అడ్వకేట్ సుబ్బారావు మద్యం సేవించి వచ్చారని వెల్లడి
- టెస్ట్ చేస్తున్న సమయంలో హంగామా సృష్టించారన్న సీఐ

పెన్ పవర్ డెస్క్:సింగర్ మంగ్లీ, అడ్వకేట్ సుబ్బారావు మధ్య కొనసాగుతున్న వివాదం పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్కంఠకు దారితీస్తోంది. ఈ కేసులో వస్తున్న వివిధ రకాల ఆరోపణలపై పంజాగుట్ట సీఐ రామకృష్ణ

మిగతా 2లో





## చంద్రబాబు అవినీతి దాహం వల్ల రాష్ట్రానికి అమరావతి మోయలేని భారంగా మారింది

- రాష్ట్రం దివాలా తీసేలా రాజధానిని నిర్మిస్తున్నారని పేర్ని నాని విమర్శ
- మావిగన్ తో తక్కువ ఖర్చుతో రాజధానిని నిర్మించుకోవచ్చని వ్యాఖ్య
- చంద్రబాబుకు విశ్వసనీయత లేదని ఎన్టీఆర్ అన్నారన్న పేర్ని నాని

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు, ఆయనకున్న అవినీతి దాహం వల్ల రా ష్ట్రానికి అమరావతి ఒక మోయలేని భారంగా

మిగతా 2లో

## ఇటువైపు వస్తే నాశనమే

- దిగ్బంధనం షురూ.. ఇరాన్‌కు ట్రంప్ మరో వార్నింగ్
- ఇరాన్ ఓడరేవుల వద్ద నౌకలను అడ్డుకుంటున్న అమెరికా... సమీపానికి వస్తే ఇరాన్ నౌకలను పేల్చేస్తామన్న ట్రంప్
- ఇరాన్ నౌకలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు
- ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దళం దిగ్బంధం ప్రారంభం
- సమీపానికి వస్తే నౌకలను ధ్వంసం చేస్తామన్న ట్రంప్
- అంతర్జాతీయ జలాల్లో నౌకల కదలికలపై ఆంక్షలు విధించడం చట్టవిరుద్ధమన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్‌పై అమెరికా నావికా దళం పూర్తిస్థాయి దిగ్బంధాన్ని ప్రారంభించడంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా నేవీ మరిన్ని బలగాలను రంగంలోకి దించింది. ఇరాన్ ఓడరేవుల వద్ద వచ్చిపోయే నౌకలను అడ్డుకుంటోంది. తమ దిగ్బంధం సమీపంలోకి

మిగతా 2లో



# ఇక సెలవు.. ముగిసిన ఆశా భోస్లే అంత్యక్రియలు

పెన్ పవర్ డెస్క్: భారత సంగీత శిఖరం, లెజెండరీ సింగర్ ఆశా భోస్లే అంత్యక్రియలు ముగిశాయి. సోమవారం (ఏప్రిల్ 13) సాయంత్రం ముంబైలోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు. కుమారుడు ఆనంద్ భోస్లే తల్లి చితికి నిప్పంటించారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఆమిర్ ఖాన్ , విక్కీ కౌశల్, అనూప్ జలోటా, షాన్, వివేక్ ఒబెరాయ్ తదితర బాలీవుడ్, క్రీడా ప్రముఖులు,

మిగతా 2లో



## ఓట్ల తొలగింపుతో ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం

- న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలన్న సుప్రీంకోర్టు
- ఓటరు జాబితాలో కొనసాగే హక్కు ఓటరుకు ఉంటుందన్న సుప్రీంకోర్టు
- 'సర్' ప్రక్రియకు సంబంధించిన పిటిషన్లు ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నట్లు వెల్లడి

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# 'డెకాయిట్' సామాజిక ప్రేమకథ..!

తెలుగు తెరపై అడివి శేష్ కథ ఎంచుకున్నారంటే అందులో ఏదో ఒక మ్యాజిక్ ఉంటుందని, ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్లకు ఆయన కేరాఫ్ అడ్రస్ అని సగటు ప్రేక్షకుడు ఆశిస్తాడు.. కానీ, 'డెకాయిట్ ఒక ప్రేమకథ' ఆ అంచనాలను దాటి, మన సామాజిక స్పృహను తట్టి లేపే ఒక సరికొత్త ప్రయోగం. షానీల్ డియో దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం కేవలం ఒక ప్రేమకథా లేక వ్యవస్థపై సంధించిన అస్త్రమా? అనే కుతూహలం సినిమా ఆరంభం నుండే మొదలవుతుంది. సాధారణంగా శేష్ సినిమాల్లో కనిపించే వేగం కంటే, ఇందులో కనిపించే భావోద్వేగాల బరువు ప్రేక్షకుడిని మరింత లోతుగా కథలో లీనం చేస్తుంది. హరిదాస్, సరస్వతిల ప్రేమ ఒక స్వచ్ఛమైన కావ్యంలా అనిపిస్తుంది. కానీ, ఈ ప్రేమకథ వెనుక దాగి ఉన్న చీకటి కోణాలేమిటి? ఒక యువకుడిని సమాజం ఎందుకు వెలివేసింది? కేవలం కులం ప్రాతిపదికన ఒక నిష్కల్మషమైన ప్రేమికుడు 'డెకాయిట్'గా మారాల్సి రావడం వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి? ఈ ప్రశ్నలే ప్రేక్షకుడిని సీటు అంచున కూర్చోబెడతాయి.. హరిని హత్య కేసులో ఇరికించినప్పుడు వ్యవస్థ చూపిన క్రూరత్వం, చట్టం చేతుల్లో చిక్కిన ఒక సామాన్యుడి ఆర్తనాదంలా మన గుండెను తాకుతుంది.

కులం అనే అడ్డుగోడ మనుషుల మధ్య దూరాన్ని పెంచడమే కాదు, ప్రాణాలను ఎలా బలి తీసుకుంటుందో ఈ చిత్రం కళ్లకు కడుతుంది. అడివి శేష్ తన గంభీరమైన నటనతో హరి పాత్రలోని వేదనను అద్భుతంగా పండించారు. ఆయన మునుపటి పాత్రల కంటే ఇందులో ఒక రకమైన పరిణతి, నిశ్శబ్దంతో కూడిన ఆవేశం కనిపిస్తుంది. 'ప్రపంచం పెద్ద జాతి ప్రజలదే' అనే డైలాగ్ విన్నప్పుడు, మన చుట్టూ ఉన్న వ్యవస్థలోని వివక్షను ప్రశ్నించుకోకుండా ఉండలేం. అధికారం, అణచివేత మధ్య నలిగిపోయే సామాన్యుడి ఆవేదన వెనుక ఉన్న రాజకీయం ఏమిటో అర్థం చేసుకోవాలంటే సినిమాలోని ప్రతి సన్ని వేశాన్ని నిశితంగా గమనించాల్సిందే. దర్శకుడు కుల వివక్షను కేవలం ఒక పాయింట్‌లా కాకుండా, కథలో అంతర్భాగంగా చూపిస్తూనే అది ఒక మనిషి వ్యక్తిత్వాన్ని ఎలా మార్చేస్తుందో అద్భుతంగా ఆవిష్కరించారు.

సినిమా ద్వితీయార్థం మరో మలుపు తిరుగుతుంది. కోవిడ్ కాలంలోని చీకటి రోజులను గుర్తుచేస్తూ, వైద్య రంగంలోని మాఫియాను ఎండగట్టిన తీరు విస్తుపోయేలా చేస్తుంది. ఆసుపత్రిలో జరిగే అవయవ విక్రయాలు, మృత దేహాల అక్రమ రవాణా వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరు? ప్రజలు ప్రాణ భయంతో వణికిపోతున్న వేళ, శవాల మీద పైసలు ఏరుకునే నీచమైన వ్యవస్థను హరి ఎలా ఎదురించాడనేది వెండితెరపై ఒక హై-వోల్టేజ్ డ్రామాగా మలిచారు.. తన భర్త ప్రాణాలు కాపాడుకోవడానికి సరస్వతి పడే తపన, ఆమెను హరి వైపు ఎలా నడిపించింది నైతికత, అవసరాల మధ్య సాగే ఈ పోరాటంలో మృణాల్ నటన హైలైట్. ఆమె పాత్రలోని సంఘర్షణ, ఆమె భావాలు ప్రేక్షకుడిని ఆ పాత్రతో పాటు ప్రయాణించేలా చేస్తాయి. సాంకేతికంగా ఈ సినిమా ఒక అద్భుతం. షానీల్ డియో విజన్ ప్రతి ఫ్రేమ్‌లోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఫ్లాష్ బ్యాక్‌లోని రంగుల ప్రపంచానికి, వర్తమానంలోని గ్రే-స్కేల్ నిశ్శబ్దానికి మధ్య ఉన్న వ్యత్యాసం కాలం మిగిల్చిన గాయాలను గుర్తుచేస్తుంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం, జ్ఞాని నేపథ్య సంగీతం సన్నివేశాల్లోని ఉత్కంఠను పతాక స్థాయికి తీసుకెళ్లాయి.. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లోని సౌండ్ డిజైన్ సరికొత్త అనుభూతినిస్తుంది. ధనుష్ భాస్కర్ విజువల్స్ కొత్తగా ఆవిష్కరించాయి. అబ్బూరి రవి రాసిన సూటిగా, సుత్తి లేకుండా ఉండే మాటలు ఆలోచింప జేస్తాయి. ప్రతి సంభాషణ ఒక సందేశంలా కాకుండా, పాత్రల అంతర్గత మథనంగా వినిపిస్తుంది.

క్లైమాక్స్‌లో అనురాగ్ కశ్యప్ ఇచ్చే వివరణ ఈ కథలోని చిక్కుముడులను ఎలా విప్పుతుంది? న్యాయం అందని చోట ప్రతీకారం పుట్టడం సహజమేనా? చట్టం దృష్టిలో హరి చేసిన నేరాలు, మానవత్వపు కోణంలో సబబేనా? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాలంటే ఈ సినిమా చూడాల్సిందే.. ప్రతీకారం కంటే మన్నింపు గొప్పదని చెబుతూనే, చివరికి ప్రేమ ఎలా గెలిచింది అనేది మనసును హత్తుకునేలా చిత్రీకరించారు. విచారణ సన్నివేశం కేవలం ఒక క్రైమ్ కేసు ముగింపు కాదు, అది ఒక మనిషి జీవితానికి దక్కిన విముక్తి. మన చుట్టూ ఉన్న అసమానతలపై నిలదీసే ఒక ప్రశ్న. అడివి శేష్, మృణాల్‌ల అద్భుత కెమిస్ట్రీ, దర్శకుడి సాహసోపేతమైన కథనం కలిసి ఈ చిత్రాన్ని ఒక మైలురాయిగా నిలబెట్టాయి. ఆసక్తికరమైన మలుపులు, మనసును కదిలించే భావోద్వేగాలతో సాగే ఈ సినిమా, ప్రేక్షకుల మెదళ్లలో ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తుంది.

# హర్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు

- మొదటి పేజి తరువాయి

మహమ్మద్ ఫతాలీ న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత క్లిష్ట సమయంలోనూ సానుకూల సంబంధాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. భారత్‌తో ఉన్న మైత్రి కారణంగా రవాణా ఉచితంగా సాగుతోందని అన్నారు.అమెరికాతో చర్చలు పునఃప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ తమ డిమాండ్లకు అనుకూలంగా స్పందించాలని స్పష్టం చేశారు. మా షరతులను అమెరికా అంగీకరిస్తే, మరో విడత చర్చలు సాధ్యమవుతాయని అన్నారు. ఇటీవల తాత్కాలిక యుద్ధ విరమణ అనంతరం చర్చల సందర్భంగా అమెరికా అంగీకార యోగ్యం కాని డిమాండ్లు తమ ముందు ఉంచిందని పేర్కొన్నారు. అందుకే చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందని అన్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై మహమ్మద్ ఫతాలీ స్పందిస్తూ, ఇరాన్ సామర్థ్యం గురించి వాషింగ్టన్‌కు తెలుసని అన్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో, భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

# ప్రభుత్వ పనితీరు ప్రజలకు క్షేత్రస్థాయిలో కనిపించాలి

- మొదటి పేజి తరువాయి

సదుపాయాలు కచ్చితంగా పనిచేయాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని స్పష్టం చేశారు.

"హాస్టళ్ల వసతుల మెరుగుదలకు 'సాస్కీ' నిధులు కేటాయించాం. నిధులు ఇచ్చినా పనులు జరగకపోతే అది అధికారుల వైఫల్యమే అవుతుంది. వసతులు కల్పించడంతో పాటు, వాటి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. ఆహారం, నీటి సరఫరా, పారిశుద్ధ్యం విషయంలో ఏమాత్రం తేడా రాకూడదు," అని ఆయన హెచ్చరించారు. ఉన్నతాధికారులు తరచూ హాస్టళ్లను తనిఖీ చేయాలని సూచించారు.

**పట్టణాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

నగరాలు, పట్టణాల్లో తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల విషయంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. పైప్‌లైన్లలోకి డ్రైనేజీ నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, తరచూ నీటి నమూనాలను పరీక్షించాలని ఆదేశించారు.

వీధి దీపాలు నిరంతరం వెలగాలని, చెత్త సేకరణ ఎక్కడా ఆగకూడదని చెప్పారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి, పరిష్కరించే వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. "పని పూర్తయ్యాక స్థానికుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోండి. ప్రభుత్వం వెంటనే స్పందించిందనే భావన ప్రజల్లో కలగాలి. పారిశుద్ధ్య నిర్వహణలో తాడిపత్రి ఆదర్శంగా నిలుస్తోంది. స్థానిక నేతలు చొరవ తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి" అని చంద్రబాబు అన్నారు.

**మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యత**

మహిళలు, చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. "మహిళల జోలికి రావాలన్నా, అఘాయిత్యం చేయాలనే ఆలోచన రావాలన్నా నేరస్థులు వణికిపోవాలి. తప్పు చేసిన వారిని అరెస్టు చేయడమే కాదు, వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. మహిళల్లో భయాన్ని పోగొట్టి, తప్పు చేసేవారిలో భయాన్ని పెంచాలి" అని ఆయన అన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని, గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితి మెరుగుపడిందని, దీన్ని పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు. గంజాయి నివారణకు రాష్ట్రంలో అమలు చేస్తున్న 'ఈగల్' విధానాన్ని ఒడిశా ప్రభుత్వం కూడా ఆదర్శంగా తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

**పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్లు**

పేదవాడి ఆకలి తీర్చడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న ముఖ్యమంత్రి, అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ నియోజకవర్గాల్లో కూడా ఈ క్యాంటీన్లను విస్తరించనున్నట్లు తెలిపారు. వీటి నిర్వహణ కోసం ఏడాదికి సుమారు రూ.200 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేందుకు దాతలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పేదలు సంతృప్తిగా, కడుపునిండా భోజనం చేసేలా క్యాంటీన్లను నిర్వహించాలని, అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

**ఆవిష్కరణలు, సాంకేతికతపై సరికొత్త ప్రణాళికలు**

రాష్ట్రాన్ని ఆవిష్కరణల కేంద్రంగా మార్చే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా విద్యార్థి దశ నుంచే ఆవిష్కరణల ఆలోచనలను ప్రోత్సహించాలన్నారు. అగస్త్య ఫౌండేషన్ వంటి సంస్థలతో కలిసి పనిచేయాలని, 175 నియోజకవర్గాల్లోని ఎంఎస్ఎంఈ పార్కులతో ఆర్టీఐహెచ్‌ను అనుసంధానించాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అల్లూరి, మన్యం, పోలవరం జిల్లాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందించే పైలట్ ప్రాజెక్టును చేపట్టాలన్నారు.

'జలధార' కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి సమర్థవంతంగాద

అమలు చేయాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని ఆదేశించారు. చెరువులు నింపే విషయంలో అన్నమయ్య జిల్లాను ఆదర్శంగా తీసుకోవాలని, అవసరమైతే ఇతర జిల్లాల బృందాలకు అక్కడ శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపుతో ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం

అధిక సంఖ్యలో ఓట్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన 'సర్' ప్రక్రియపై భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో కొనసాగే హక్కు ఓటరుకు ఉంటుందని, ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ప్రక్రియను వక్రీకరించకూడదని పేర్కొంది.అయితే, 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని గుర్తు చేసింది.సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తోందని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించగా, పిటిషనర్లు ఇప్పటికై ట్రైబ్యునళ్లను ఆశ్రయించారని, కాబట్టి ఈ వాదనల్లో పసలేదని సుప్రీంకోర్టు పేర్కొంది.'సర్' ప్రక్రియపై దాఖలైన పిటిషన్లను విచారించేందుకు కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు ఏర్పడినట్లు ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉంటాయని తెలిపింది.అయితే ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా లేక గడువును పొడిగిస్తూనే ఉంటారా అని పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశ్నించారు.ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ దేశంలో

ఓటు రాజ్యాంగపరమైనదే కాకుండా, భావోద్వేగ అంశం కూడా అని పేర్కొంది. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో భాగమని తెలిపింది. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో ఇది కీలకమని వ్యాఖ్యానించింది. అలాగే విచారణకు సంబంధించి కాలపరిమితిని నిర్ణయించి ట్రైబ్యునళ్లపై భారం మోపలేమని స్పష్టం చేసింది. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని తెలిపింది.

## ఈ నెల 15న ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

భోజనం అందిస్తుండగా, తాజాగా మరో 62 గ్రామీణ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో మొత్తం క్యాంటీన్ల సంఖ్య 269కి చేరనుంది.ధరణికోటలో ప్రారంభం కానున్న ఈ క్యాంటీన్ ద్వారా స్థానిక ప్రజలు, ముఖ్యంగా రోజువారీ కూలీలు, వ్యవసాయ కార్మికులు కేవలం రూ.5కే నాణ్యమైన భోజనం పొందవచ్చు. సీఎం చంద్రబాబు హాజరయ్యే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఈ పథకాన్ని విస్తరించి, పేదలకు అండగా నిలవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# వివేకా హత్య కేసులో సునీత పిటిషన్

## కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి హైకోర్టు ఆదేశం

- మొదటి పేజి తరువాయి

ఈ నెల 27వ తేదీలోపు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తీరుపై సునీత అసంతృప్తి వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. దర్యాప్తు సంస్థ పలు అనుమానాస్పద, సందేహాస్పద అంశాలను విస్మరించిందని, కేసులో లోతైన విచారణ జరిపేలా సీబీఐని ఆదేశించాలని ఆమె తన పిటిషన్‌లో అభ్యర్థించారు. సోమవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించేందుకు గడువు కావాలని కోరారు. ఇందుకు అంగీకరించిన ధర్మాసనం, ఈ నెల 27లోపు కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను అదే తేదీకి వాయిదా వేసింది. సీబీఐ కౌంటర్ దాఖలు చేశాక, ఇరుపక్షాల వాదనలు

విన్న తర్వాత తదుపరి దర్యాప్తుపై హైకోర్టు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

దీంతో ఈ కేసులో న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజు

- మొదటి పేజి తరువాయి

హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (17439/40) కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రోజు శ్రీకాకుళం జిల్లాకు ఒక చారిత్రాత్మకమైన రోజని ఆయన అభివర్ణించారు.ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రక్షేత్రంతో ఈ రైలు అనుసంధానం చేస్తుందని తెలిపారు. దీనివల్ల వేలాది మంది భక్తులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందన్నారు. ప్రయాణికులతో మాట్లాడినప్పుడు వారిలో కనిపించిన ఆనందం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ రైలు సేవ కేవలం ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు.ఈ కొత్త రైలు సేవను సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని ఎన్‌డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ఇది కేవలం ఒక రైలు మాత్రమే కాదని, శ్రీకాకుళం ప్రజల ఆశలు, ఆకాంక్షలను అభివృద్ధికి అనుసంధానించే కీలక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# చంద్రబాబు అవినీతి దాహం వల్ల రాష్ట్రానికి అమరావతి మోయలేని భారంగా మారింది

- మొదటి పేజి తరువాయి

మారిందని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏపీ రాజధాని అంశంపై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే వచ్చే ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు తన స్వార్థం కోసం రాష్ట్రాన్ని దివాలా తీసేలా రాజధానిని నిర్మిస్తున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మంత్రులతో వైసీపీ అధినేత జగన్ ను బూతులు తిట్టిస్తూ, అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని మండిపడ్డారు.రాజధాని అనేది సిరిసంపదలను ఇచ్చేలా ఉండాలి తప్ప, అప్పుల పాలు చేసేలా ఉండకూడదని పేర్కొన్నారు. 'మావిగన్' అనే ప్రతిపాదనతో తక్కువ ఖర్చుతో రాజధానిని నిర్మించుకోవచ్చని, దీనిపై ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు. చంద్రబాబుకు విశ్వసనీయత లేదని గతంలో ఎన్టీఆరే స్వయంగా అన్నారని గుర్తుచేశారు. వెన్నుపోటు రాజకీయాలతో, ఎమ్మెల్యేలను కాసులతో కొనుగోలు చేసిన చరిత్ర చంద్రబాబుదని దుయ్యబట్టారు. గతంలో ఆయన కేబినెట్‌లోని మంత్రులే ఆయనను తీవ్రంగా విమర్శించారని అన్నారు.చంద్రబాబు అంతులేని అవినీతితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్ని నాని హెచ్చరించారు. అమరావతి విషయంలో ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్తులో రాష్ట్రానికి తీరని నష్టం కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇక సెలవు.. ముగిసిన ఆశా భోస్లే అంత్యక్రియలు

- మొదటి పేజి తరువాయి

రాజకీయ నాయకులు శివాంజీ పార్క్ శ్మశానవాటికకు చేరుకుని ఆశా భోస్లే పార్థివ దేహానికి కడసారి నివాళులు అర్పించారు.

అంతకముందు ఆశా భోస్లే నివాసం నుంచి దాదర్‌లో ఉన్న శివాజీ పార్క్ శ్మశానవాటిక వరకు భారీ జనసందోహం నడుమ ఆమె అంతిమయాత్ర సాగింది. భారత సంగీత శిఖరాన్ని కడసారి చూసేందుకు పలువురు క్రీడా, సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు అంతిమయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముంబై గల్లీలన్ని ఆశాభోస్లే అమరా హే నినాదాలతో మారుమోగిపోయాయి. అశ్రునయనాలతో గాన కోకిలకు అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా, అనారోగ్యంతో భారత సంగీత శిఖరం, లెజెండరీ సింగర్ ఆశా భోస్లే (92) ఏప్రిల్ 12న కన్నుమూసిన విషయం తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో ఆమె తుది శ్వాస విడిచారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్?తో ఆమె మరణించినట్లు వైద్యులు వెల్లడించారు.

# ఇటువైపు వస్తే నాశనమే

- మొదటి పేజి తరువాయి

ఇరాన్ నౌకలు వస్తే వాటిని తక్షణమే ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ ఓడరేవులకు వద్దకు నౌకలు రావాలంటే తమ అనుమతి తీసుకోవాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇరాన్ ఓడరేవులకు వచ్చే, పోయే అన్ని సముద్ర మార్గాలను మూసివేస్తూ అమెరికా సైన్యం నిర్దేశించిన గడువు ప్రకారం ఈ దిగ్బంధం ప్రారంభమైంది. "మా దిగ్బంధం సమీపంలోకి ఏ ఒక్క ఇరాన్ నౌక వచ్చినా, దానిని వెంటనే తుడిచిపెట్టేస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు.అయితే, అమెరికా చర్యను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ జలాల్లో నౌకల కదలికలపై ఆంక్షలు విధించడం చట్టవిరుద్ధమని ఇరాన్ సాయుధ దళాలు పేర్కొన్నాయి.

మరోవైపు, పాకిస్థాన్‌లో అమెరికాతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపారు. అమెరికా వైఖరి వల్లే చర్చలు ముందుకు సాగలేదని ఆయన ఆరోపించారు.ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌పై బాంబు దాడులు ప్రారంభించింది. మరూబ్ పట్టణంలో జరిగిన దాడుల్లో కనీసం నలుగురు మరణించారు. హెజ్బొల్లాతో ఘర్షణలు కొనసాగుతుండటంతో బింట్ జెబిల్ పట్టణ ప్రవేశ మార్గాలను ఇజ్రాయెల్ సైనికులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలోనూ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం

- మొదటి పేజి తరువాయి

పరిధిలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. నేడు సాయంత్రం 16.01 గంటలకు జీహెచ్ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ, ఇప్పటి వరకు ఇది అత్యధికం.గ్రేటర్ హైదరాబాద్ చరిత్రలో 2026 మార్చి 3వ తేదీన 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగంతో ఇప్పటి వరకు ఆల్ టైమ్ రికార్డుగా ఉంది. రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు అవాంతరాలు ఎదురుకాకుండా విద్యుత్ సరఫరా సాగిస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. భవిష్యత్తులో మరింత డిమాండ్ పెరిగినా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

## మంగ్లీ వర్సెస్ అడ్వకేట్ సుబ్బారావు పంజాగుట్ట పోలీసుల కీలక వివరణ

- మొదటి పేజి తరువాయి

మీడియాకు పూర్తి వివరాలను వెల్లడించారు.ఈ వివాదం వెనుక ఒక పెద్ద ఫైనాన్స్ స్కామ్ ఉందనే వార్తలపై సీఐ స్పందిస్తూ... ఇప్పటివరకు తమకు ఆ స్కామ్‌కు సంబంధించి ఎలాంటి అధికారిక ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేశారు. బాధితులుగా చెప్పుకుంటున్న వారు కూడా ఈ స్టేషన్ పరిధిలోకి రారని తెలిపారు. కొంతమంది బాధితులతో కలిసి సుబ్బారావు స్టేషన్‌కు వచ్చిన సమయంలో, ఆయన మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. తక్షణమే నిర్వహించిన బ్రీత్ అనలైజర్ టెస్టులో 27 ఎంజీ ఆల్కహాల్ శాతం నమోదైనట్లు వెల్లడించారు. టెస్ట్ చేస్తున్న సమయంలో సుబ్బారావు మీడియా సాక్షిగా హంగామా సృష్టించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించారని పేర్కొన్నారు. ప్రస్తుతానికి రెండు వర్గాల ఫిర్యాదులను నిశితంగా పరిశీలిస్తున్నామని, చట్టప్రకారం నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగిస్తామని పంజాగుట్ట సీఐ తెలిపారు.

## టీడీపీ యువగళం ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు అందజేత





**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 13:**ప్రముఖ పారిశ్రామిక వేత్త, కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు జన్మదిన వేడుకలు ఆదివారం కొవ్వూరు నియోజకవర్గంలో పలు చోట్ల అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో తాళ్లపూడి మండలం, అన్నదేవరపేట గ్రామంలో హై స్కూల్లో విద్యార్థులకు 100 భోజనం ప్లేట్స్, 100 గ్లాసులు అందించటం జరిగింది. ఈ సందర్భంగా కాకర్ల సత్యేంద్ర మాట్లాడుతూ నిన్న ఆదివారం కావటం వల్ల సోమవారం పిల్లలకి ప్లేట్స్, గ్లాస్ లు టీడీపీ యువగళం 2.0 ఆధ్వర్యంలో అందించటం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువగళం టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# పీజీఆర్ఎస్‌లో 118 అర్జీలు స్వీకరణ

- రెవెన్యూ క్లినిక్‌లో 2 దరఖాస్తులు
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



**గంగవరం/రంపచోడవరం, పెన్ పవర్,ఏప్రిల్ 13** :పోలవరం జిల్లా పరిధిలో నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశంలో మొత్తం 118 అర్జీలు స్వీకరించగా, రెవెన్యూ క్లినిక్‌లో మరో 2 అర్జీలు అందినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.అర్జీలను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి తగిన విధంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఆర్థిక సంబంధిత అంశాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ నిధుల విడుదల చేపట్టాలని సూచించారు. ఆర్థికేతర అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచకూడదని హెచ్చరించారు.అన్ని అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రోజువారీగా పరిశీలిస్తూ రాష్ట్ర సగటు మేరకు పరిష్కారం చేయాలని సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా పారదర్శకత, జవాబుదారితనం పాటించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజల సంతృప్తిని అంచనా వేసేందుకు ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు సరైన అవగాహన కల్పించి సమగ్ర పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా చూసుకోవాలని, ప్రజల సంతృప్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పలువురు అర్జీదారుల సమస్యలను స్వయంగా తెలుసుకున్న కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో చింతూరు ఐటిడిఎ పీఓ శుభం నొక్వల్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీతతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి చొరవ అవసరం





- సిబ్బంది కేటాయింపుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి:
- కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13** :ఏజెన్సీ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి అధికారులు చొరవ చూపాలని, సిబ్బంది కొరత నివారణకు రాష్ట్ర స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు.సోమవారం సాయంత్రం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన సిబ్బంది కేటాయింపుల కోసం సంబంధిత శాఖలు స్పష్టమైన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఇప్పటికే పలు శాఖల ఉన్నతాధికారులకు డీఓ లేఖలు పంపినట్లు తెలిపారు.క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అధికారి వ్యక్తిగత బాధ్యతతో పనులు చేపట్టి, సమయానికి పూర్తి చేయాలని, చిన్న చొరవతో పెద్ద మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.మారుమూల ప్రాంతాల్లో నివసించే లబ్ధిదారులకు హౌసింగ్ ప్రోగ్రామ్, పీవీటీజీ కింద పీఎం జన్మన్ పథకం ద్వారా గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల వారీగా లోటుపాట్లు గుర్తించి, వాటి పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా జారీ చేయాల్సిన సర్టిఫికెట్లను సమయానికి అందించాలని, అన్ని శాఖలు సాచురేషన్ విధానంలో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.తంగేడు కోట, పాత కోట, సింగన్న కోట ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వ భవనాలు, క్వార్టర్స్, సచివాలయాల పరిస్థితిని మెరుగుపరచాలని ఆదేశించారు. ఎటపాక మండలం పిచుకులపాడు గ్రామంలో కాలువ గండి సమస్య పరిష్కారానికి తక్షణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అంగన్వాడి భవనం నిర్మాణానికి నిధుల ప్రతిపాదనలు పంపాలని సూచించారు.నరేగా పథకం కింద చెరువుల అభివృద్ధి పనులు చేపట్టి చర్య అనంతర నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రతి గృహానికి సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేయడం లక్ష్యంగా గృహాల వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పంచాయతీ భవనాలపై కేంద్ర సబ్సిడీతో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ విషయంలో నెడ్కాప్‌తో సమన్వయం చేసుకుని వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం తమ ప్రాథమిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో అనుమతులు అవసరమైన అంశాలపై స్థానిక పరిస్థితులను స్పష్టంగా తెలియజేస్తూ ప్రతిపాదనలు పంపితే త్వరితగతిన ఆమోదాలు లభిస్తాయని తెలిపారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో సచివాలయ మహిళా పోలీసు మృతి..



**గంగవరం,పెన్ పవర్, ఏప్రియల్ 13:** మండలంలోని మోహనాపురం సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న ,నాగులపల్లి సౌజన్య (36) అనారోగ్య కారణాలతో ఆదివారం రాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. మృతురాలు సౌజన్యకు వివాహం కాగా, ఆమె భర్త వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తున్నారు. ఆమె తండ్రి నాగులపల్లి ప్రకాష్ రాయిపల్లి గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

సౌజన్య మృతితో రాయిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విధి నిర్వహణలో చురుగ్గా ఉంటూ, అందరితో కలివిడిగా ఉండే సౌజన్య మరణం పట్ల స్థానికులు మరియు తోటి సచివాలయ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం రాయిపల్లి గ్రామంలో ఆమె అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. ఆమె మృతి పట్ల ఎంపీడీవో లక్ష్మణరావు ఎంపీపీ కృష్ణారెడ్డి సచివాలయం సిబ్బంది తమ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు

## గంగవరంలో నారి శక్తి వందన సమ్మేళనం



**గంగవరం, పెన్ పవర్ ఏప్రిల్ 13:** గంగవరం మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం నాడు "నారి శక్తి వందన సమ్మేళనం" దృశ్య సమావేశం ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కుంజం వీర వెంకట సత్యనారాయణమ్మ, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు తీగల ప్రభ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, వెలుగు ఏపీఎం అప్పలకొండ, హెచ్‌డీసీ సమన్వయకర్త ఎస్. గణపతి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ సంఘాల సహాయకులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సాధికారతపై మాట్లాడుతూ కుంజం వీర వెంకట సత్యనారాయణమ్మ మహిళలు ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయ రంగంలో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. మహిళలకు రిజర్వేషన్ల ప్రాముఖ్యతను వివరించారు.అలాగే వేసవి కాలంలో ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ పర్యవేక్షకురాలు కే. కుమారి, ప్రజా ఆరోగ్య నర్సు ఆర్. దైవకృప, సముదాయ ఆరోగ్య అధికారి ఎం. మేరీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సూర్య ఆంధ్ర ప్రగతి రథం ప్రచారానికి కలెక్టర్ కీర్తి చేకూరి శ్రీకారం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13**ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన "సూర్య ఆంధ్ర ప్రగతి రథం" ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సౌరశక్తిని వినియోగించడం ద్వారా ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్ అందించే దిశగా ఈ పథకం అమలు జరుగుతోందన్నారు. ఈ పథకం ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభించడంతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని తెలిపారు. అదనంగా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని చెప్పారు.ఇంటి యజమానులు, అపార్టుమెంట్లు, హౌసింగ్ సొసైటీలు, రైతులు, చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. సౌరశక్తి వినియోగంతో పర్యావరణ పరిరక్షణతో పాటు మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.

ఈ పథకం కింద 2 కిలోవాట్ల వరకు సోలార్ వ్యవస్థలకు సుమారు 60% వరకు సబ్సిడీ లభిస్తుందని, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి 2 కిలోవాట్ల వరకు 100% సబ్సిడీ అందుబాటులో ఉందని వివరించారు. ఇతర వర్గాలకు కూడా ప్రభుత్వం అనుకూల సబ్సిడీలు, సులభ రుణ సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.

సూర్య ఆంధ్ర ప్రగతి రథం ద్వారా ఏప్రిల్ 13 నుంచి 16 వరకు జిల్లాలో బుర్రకథ బృందాలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు పథకం వివరాలు తెలియజేస్తారని తెలిపారు.

2027 వరకు ఈ పథకం కింద ప్రయోజనం పొందే అవకాశం ఉందని, విద్యుత్ వినియోగ దారులు ఈ పథకంను లబ్ది పొందాలని, ప్రకృతి వనరులు పరిరక్షణ లో భాగస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. బుర్రకథ కళాకారుల ప్రదర్శనను తిలకించి కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమాన్ని నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , ఏపీఈపీడీసీఎల్, ఎన్ఆర్ఈడీసీఏపీ, సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో ఎస్ ఈ (ఏపీ ఈపీడిసిఎల్) కె తిలక్ కుమార్, ఎన్ఆర్ఈడీసీఏపీ అభివృద్ధి అధికారి కే. శివ బాల కుమార్, ఎన్ఎస్ఈఎఫ్ఐ ప్రతినిధి ఉదయ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్ మంగళవారం 14 ఏప్రిల్ 2026

# ఇసుక దందా అరాచకాలు అరికట్టాలి

### స్థానిక ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ కు వైసీపీ నాయకులు వినతిపత్రం



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఏప్రిల్ 13 :** సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అండదండలతో జరుగుతున్న ఇసుక దందా అరాచకాలు అరికట్టాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పీతా రామకృష్ణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్గాని సురేష్ లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు ఇసుక లారీలు వల్ల మల్లయ్య పేట ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పీతా రామకృష్ణ మాట్లాడుతూ మల్లయ్య పేట ప్రజలు హెవీ లోడ్డుతో వెళుతున్న ఇసుక లారీలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ధూళి, దుమ్ము కారణంగా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. లారీల రాకపోకల వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక రవాణా చేసే లారీలకు తప్పనిసరిగా టార్పాలిన్ కవర్లు కప్పేలా చూడాలని కోరారు.లోడ్ పరిమితి మించకుండా వాహనాలను నియంత్రించాలని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షులు మార్తి లక్ష్మీ మాట్లాడుతూ 24 గంటలు మల్లయ్యపేట పేపర్ మిల్లు రోడ్డుపై దుమ్ము దూళి వెదజల్లుతూ ఇసుక లారీలు అక్రమ రవాణా చేస్తున్నాయని అన్నారు. కార్మికులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, సాధారణ ప్రజలు ఈ సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు .వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్గాని సురేష్ మాట్లాడుతూ ఇసుక దందా అరాచకాలు అరికట్టాలని, అనుమతి లేని ఇసుక ర్యాంపుల నుండి ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.:కాతేరు-రా జమహేంద్రవరం ప్రధాన రహదారిపై ఇసుక లారీల రాకపోకలను నియంత్రించాలని పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మార్తి నాగేశ్వరావు, వైసీపీ జిల్లా సెక్రెటరీ శ్యామ్, వైసిపి వార్డ్ ఇంచార్జి మునీశ్వరరావు, వైసిపి నాయకులు బసరు పోయిన విజయశంకర్, వంగల మహాలక్ష్మి , మట్టయ్య , వనం రాంబాబు, పీత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రతిష్ట కు ఆదర్శంగా నిలిచిన హెడ్ కానిస్టేబుల్ రేవతి

- జిల్లాలో మరుగున పడిన రెండు నేర ఘటనల పై కమిటీ వేయాలి...
- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ మేడా శ్రీనివాస్ డిమాండ్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:**మదురై కోర్టు వంటి న్యాయ విచారణ ఆంధ్రప్రదేశ్ లో తూర్పు గోదావరి జిల్లాలో చేపడితే సంచలనమైన రెండు కేసుల్లో నిందితులకు ఉరిశిక్ష పడే అవకాశాలు 100 శాతం ఉంటాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తెలిపారు. అర్పిసి ప్రధాన కార్యా లయంలో జరిగిన సమావేశంలో
సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత న జరిగిన సమావేశం జరిగింది.
ఈ సమావేశంలో మేడా శ్రీనివాస్ . మాట్లాడుతూ, తమిళనాడు సాత్తాన్ కుళం పోలీస్ స్టేషన్ లో తండ్రి , కొడుకు లను అమానుషంగా కొట్టి వారి మృతి కి కారణం అయిన 9 మంది పోలీస్ లకు మదురై కోర్టు మరణ శిక్షను ఖరారు చేయటం పట్ల ప్రజలు స్వాగతిస్తున్నట్లు తెలిపారు . అర్థశతాబ్దం పైబడిన భారతదేశ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం, న్యాయం కూడా కొంత బ్రతికే వుందని పౌరుల్లో ఆశ కల్పించిన మదురై కోర్టుకు ప్రజలు అభినందనలు వెలువెత్తుతున్నాయన్నారు. పోలీస్ ఉన్నత అధికారుల ఒత్తిడిలకు , వేధింపులకు లొంగకుండా కళ్ళముందు జరిగిన దారుణాన్ని న్యాయస్థానానికి తెలియచేసిన హెడ్ కానిస్టేబుల్ రేవతి ప్రజల హృదయాలను గెలుచుకున్నా రన్నారు. హెడ్ కానిస్టేబుల్ " రేవతి " సాక్ష్యం పోలీస్ శాఖకే ఆదర్శంగా నిలిచిందన్నారు. పోలీస్ శాఖలో అధికార దుర్వినియోగం పెరిగిందని , రాజ్యంగ, చట్టబద్ధమైన విధులు నిర్వహించే పోలీస్ లు నేడు కానరావటం లేదన్నారు. పోలీస్ లు పౌర హక్కులను , మానవ హక్కులను కాలరాస్తు న్నారన్నారు.

**జిల్లాలో దారుణమైన రెండు నేర ఘటనల పై కమిటీ వేయాలి...**

తూర్పుగోదావరి జిల్లాలో దారుణమైన రెండు నేర ఘటనలు జరిగాయన్నారు. ఒక కేసులో పోలీస్ లాఠీ దెబ్బలకు మృతి చెందిన ఘటన బయటకు రాకుండా ఆ పరిధి న్యాయస్థానం లో ముద్దాయి పరారిలో వున్నట్టు నేటికి రికార్డుల్లో చూపిస్తు ఆ కేసును కాలాగర్భంలో కలిపేశారన్నారు . మరో కేసులో ఒకే ఇంటి లో ఒకరిని హత్య చేసి మరో నలుగురును విష ప్రయోగంతో మొత్తం 5 గురును చంపేసారన్నారు. ఈ రెండు ఘటనల్లో పోలీసుల పై పిర్యాదులు ఉన్నప్పటికి అధికార దుర్వినియోగంతో ఈ నేరాలను నీరుగార్చి నేటికి ఆ కేసుల నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఈ రెండు కేసుల్లోను పోలీస్ ల ప్రమేయం ఉందని , ఇప్పటికి కొంతమంది పోలీస్ లు రిటైర్మెంట్ ఆయరని, కొంతమంది పోలీసులు విధుల్లో ఉన్నారన్నారు. లాకప్ మృతి ఘటనలో అప్పటి ఇంటిలిజెన్స్ అధికారి ఉన్నత అధికారులకు ప్రత్యేక నివేదిక సమర్పించినా అప్పటి మంత్రి, ఒక ఉన్నత అధికారి ప్రమేయంతో ఈ కేసులను నీరుగార్చారన్నారు. నిందితులు న్యాయస్థానాన్ని సైతం నేటికి మోసం చేస్తున్నారని, తాము లేవనెత్తిన లాకప్ మరణం, 5 కుటుంబ హత్యలు నిజ నిర్ధారణ కోసం కూటమి ప్రభుత్వం కమిటీని నియమిస్తే లిఖిత పూర్వక ఆధారాలతో, ఒక న్యాయవాదిగా , పార్టీ ప్రతినిధిగా ప్రభుత్వానికి సహకరించగ లమని, నిందితులకు శిక్ష వేయించ గలమని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తెలియ చేసారు. ఈ సమావే శంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , ఎమ్ డి హుస్సేన్ , సిమ్మా దుర్గారావు , దుద్దే త్రినాద్ , సింహాద్రి తిలక్ , , అడపా శేషగిరి , ముప్పన రమేష్ , తదితరులు పాల్గొన్నారు.

## దేశం లో నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ :13:** ఈ నెల 26 27 28 తేదీలలో తిరుపతి లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని , 26 న జరిగే భారీ కార్మిక ప్రదర్శనకు పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని కార్మికుల సత్తా మోదీకి తెలపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక జట్ల సంఘం కార్యాలయం లో మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కె రాంబాబు అధ్యక్షతన జరిగింది.

ఇటీవల ఏఐటీయూసీ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన కె రాంబాబును, మధు, జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరావు వి కొండలరావు సప్ప రమణ లను సత్కరించారు. మధు మాట్లాడుతూ మేడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పార్టీ, ట్రేడ్ యూనియన్ శ్రేణులు వాడ వాడ లా ఘనంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు.

ఇళ్ళ పట్టాలు పొందిన ప్రజలకు ఆ స్థలాలను అప్పగించాలని, లేని యెడల లబ్దిదారులకి అండగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆ స్థలాలను లబ్దిదారులకి అప్పగిస్తామని మధు అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం నేడు ప్రైవేటీకరణ జరగడం శోచనీయమని, మరోవైపు ప్రైవేటు సంస్థలకు రెడ్ కార్పెట్ పరచడం ప్రభుత్వాల ద్వంద్వ నీతికి అద్దం పడుతోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరావు మాట్లాడుతూ అనకాపల్లిలో మిట్టల్ స్టీల్స్ వంటి సంస్థలకు వేల కోట్ల రాయితీలు, భూములు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న పాలకులు,విశాఖ ఉక్కును కాపాడటంలో చూపడం లేదన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె రాంబాబు మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవం విశాఖ ఉక్కుఅని , ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వేలాది కుటుంబాలకు జీవనాధార మన్నారు. ప్రజా ప్రతినిధులు సొంత గనులు కేటాయించి లాభాల బాటలోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఈ సమావేశంలో జట్ల సంఘం అధికార ప్రతినిధులు కళ్ల అప్పలనాయుడు, వెంకటరావు, బాలకృష్ణ, సత్యనారాయణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు

## వెంకట నగరం లో బాలల, మహిళల హక్కులపై న్యాయ అవగాహన సదస్సు






డి ఎల్ ఎస్ ఎ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:**రాజమండ్రి రూరల్ మండలంలోని వెంకట నగరం పంచాయతి కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "నల్సా పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు పథకం--2024", బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం--2012, ఉచిత న్యాయ సహాయం, మధ్యవర్తిత్వం మహిళల హక్కులకు సంబంధించిన చట్టాలపై విస్తృత అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నష్టాలను, ఆమె, పిల్లల అమాయకత్వాన్ని దుర్వినియోగం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. "బాల్య వివాహ నిషేధ చట్టం--2006", "బాల కార్మిక నిర్మూలన చట్టం--1986" వంటి చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యవసరమన్నారు.

నల్సా పథకం ద్వారా పిల్లలకు అందుతున్న న్యాయ సేవల వివరాలను తెలియజేస్తూ, న్యాయ సలహాలు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు కాల్ చేయవచ్చని చెప్పారు. మహిళలు న్యాయ సమస్యలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ శాఖల అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13 :**పోలవరం జిల్లాలోని వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయ సమావేశ హాల్లో వికలాంగులకు మూడు చక్రాల ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కె. దినేష్ కుమార్, చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ట్రై సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న 15 మంది వికలాంగులకు ఇప్పటికే 15 సైకిళ్లు సిద్ధం చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ములుగుల వెంకట్ రెడ్డి, షేక్ అప్సర్, సైఫూల్ లకు కలెక్టర్ స్వయంగా ట్రై సైకిళ్లు అందజేశారు.
గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు వెంటనే ట్రై సైకిళ్లు అందించాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వికలాంగ పింఛన్ల కోసం వచ్చిన అభ్యర్థనలపై స్పందిస్తూ, అర్హులైన వారికి త్వరితగతిన పింఛన్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.వికలాంగుల శాతం వివరాలను కూడా కలెక్టర్ ఆరా తీసి, అవసరమైన సహాయం అందించేందుకు అధికారులను దిశానిర్దేశం చేశారు. ఇద్దరు పిల్లలను భవిత సెంటర్లో చేర్పించి మంచి విద్య అందిస్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని సూచించారు.
వికలాంగుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని, వికలాంగత్వ సర్టిఫికెట్ అవసరమున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, డీఎంహెచ్ఓ డాక్టర్ పి. చరిత, డిసిహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డీఈవో వై. మల్లేశ్వరరావు, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ పి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## 8వ డివిజన్ లో పార్కింగ్ నిబంధనలు అమలులో నిర్లక్ష్యం-ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం , పెన్ పవర్ ఏప్రిల్ 13:**ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు.కొన్ని కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ విస్తరణ అవసరమని ఇందుకోసం రూ.80 లక్షల అభివృద్ధి పనులను ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రాంతం కమర్షియల్ హబ్గా మారడంతో హాస్పిటల్స్, వ్యాపార సముదాయాలు పెరిగినా పార్కింగ్ నిబంధనలు అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. సెల్లార్ పార్కింగ్ సదుపాయాలు ఉండి వాహనాలను రోడ్లపై నిలిపివేయడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు, నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. భవనాలకు వచ్చే ప్రజల వాహనాల బాధ్యత ఆయా యజమానులదే" అని స్పష్టం చేశారు. టీటీడీ కల్యాణ మండపం ,చర్చ్ రోడ్డులో టీడీపీ నాయకులు, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే వాసు, స్థానికులకు ఇబ్బందిగా మారిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల పనుంచి వచ్చే డ్రైనేజీ నీరు 8వ వార్డులో నిల్వ పరిస్థితి ఉందని, ఈ వార్డు డ్రైనేజీ పరంగా కీలక ప్రాంతంగా మారిందన్నారు. గతంలో గంటల తరబడి నిలిచిపోయే డ్రైనేజీ నీరు ఇప్పటికే ప్రధాన డ్రైన్లు, కనెక్టింగ్ డ్రైన్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడం వల్ల గణనీయమైన మార్పు కనిపిస్తోం దన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

- జిల్లా కలెక్టరేట్లో అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వినతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13**

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును తీసుకురావాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేల రూపాయలు స్టైఫండ్ ఇవ్వాలని, 55 ఏళ్లు నిండిన న్యాయవాదులకీ నెలకు రూ. 15 వేలు పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ లు స్పందిస్తూ, ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర సహకార్యదర్శి బీర అరుణ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు, సొసైటీ రాష్ట్ర నాయకులు పడమట గణేశ్వరరావు, రావూరి సంగమేశ్వర రావు, అల్లంకి శివప్రసాద్, కర్రా హనుమంతరావు, కగావ, తలాటం పాండురంగారావు, కర్రి వెంకట ప్రసాద్, చంద్రమళ్ళ రాజు, కొల్లపు వేణు, పి ఎల్ నాగేశ్వరరావు, తిరునాతి వీరబాబు, పడమట సురేఖ, క్రొవిడి సుబ్రమణ్యం, కాశీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ.

★ వైఎస్ఆర్సీపీ నాయకుడు వేణు.



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 13.** బాధిత కుటుంబానికి బియ్యం నగదు అందజేసినట్లు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన టి వెంకటేష్ ఇటీవల మృతి చెందాడు అన్నారు. మృతునికి తల్లి ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. వారి ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో విషయం తెలుసుకున్న వేణు తన మిత్రబృందంతో కలిసి వెంకటేష్ ఇంటికి వెళ్లారు. కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. తమ వంతు సహాయంగా 25 కేజీలు బియ్యం ఐదు వేల రూపాయల నగదు బాధిత కుటుంబీకులకు అందజేసినట్లు వేణు తెలిపారు. ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చి ధైర్యం చెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో తలారి నాగరాజు, కంచుమర్తి మునియ్య, పెట్టాపండు, కొయ్య తేజ, వేముల సత్యనారాయణ, కంచుమర్తి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" లో 43 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచారు. పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 43 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులకు చెందిన సమస్యలపై ఆయా పోలీస్ స్టేషన్ల హౌస్ ఆఫీసర్లతో ఫోన్లో మాట్లాడి సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

## బూరుగుపూడి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..






**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 13:**కోరుకొండ మండలంలోని బూరుగుపూడి గ్రామంలో గల రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో బూరుగుపూడి సొసైటీ చైర్మన్ కంటే నాగకేశ్వరరావు, జనసేన నాయకులు అడపా శ్రీనివాస్, శ్రీరంగపట్నం సొసైటీ చైర్మన్ అడపా వీరబాబు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న ఇతర సభ్యులు
దిడ్డి మాధవరావు
పడాల పండు సొసైటీ సీఈఓ సుదర్శన్ స్థానిక రైతులు మరియు సిబ్బంది రైతులు తమ ధాన్యాన్ని శుభ్రపరిచి నిర్దేశించిన తేమ శాతం ఉండేలాచూసుకోవాలని తద్వారా వెంటనే కొనుగోలు చేసేందుకు వీలవుతుందని సొసైటీ ప్రతినిధులు కోరారు.

## జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ , రెవెన్యూ క్లినిక్ లో 183 అర్జీలు - కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:**ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం చూపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు.
సోమవారం పిజిఆర్ఎస్ , రెవెన్యూ క్లినిక్ లో జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ తో కలిసి అర్జీలను స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారులతో అర్జిల పరిష్కార విధానం, పెండింగ్, ఐ వి ఆర్ ఎస్ ఫీడ్ బ్యాక్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి ఆయా శాఖల అధికారులను ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేఘా స్వరూప్ శాఖల వారి అర్జీలను విశ్లేషణ చేసి, ఆయా అధికారుల విధి నిర్వహణ లో ప్రవర్తన, విధాన పరమైన లోటుబాట్లు ఉన్నట్లు గుర్తించామని, వాటిని సరిదిద్దు కోవాలని ఆదేశించారు. ప్రతి అధికారి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుడు నూరు శాతం సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపించాలని స్పష్టం చేశారు. ఆ అర్జీని సంబంధిత అధికారికి పంపే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. అర్జీ లో విధాన సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు వివరించా లన్నారు. రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాల న్నారు.తమ వద్ద ఉన్న పెండింగ్ పిటిషన్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్స్ కరెక్షన్స్, రెవెన్యూ అంశాలపై తాసిల్దార్లతో సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. రెవెన్యూ క్లినిక్ 78 , పంచాయతీ రాజ్ 44 , పోలీసు 23, పురపాలక పరిపాలన 8 ఇతర శాఖలకు చెందిన 30 అర్జీలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి, ఎస్డీసీ కే భాస్కర్ రెడ్డి, రాజమండ్రి ఆర్డీవో ఆర్ శివ రాముడు, సీపీవో ఎల్ అప్పల కొండ, డి ఎల్ డి వో లు పి వీణాదేవి, ఏ స్లివా రెడ్డి, సి ఐ గణేష్, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.



## జనగణన--2027 భాగంగా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 13.**తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ మరియు మెప్మా హాల్ నందు జనగణన--2027 కార్యక్రమం భాగంగా ఎన్యూమరేటర్లు మరియు సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎం యేసుబాబు అధ్యక్షత వహించారు.
ఈ శిక్షణలో ఫేజ్--1 హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్‌కు సంబంధించిన ముఖ్య అంశాలను వివరించారు. ఎన్యూమరేటర్లకు స్వీయ గణన విధానంపై ప్రత్యేక శిక్షణ అందించారు. దీనివల్ల వారు క్షేత్రస్థాయిలో డేటా సేకరణను సమర్థవంతంగా నిర్వహించగలరని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యేసుబాబు మాట్లాడుతూ జనగణన ద్వారా సేకరించే డేటా పట్టణ అభివృద్ధి ప్రణాళికలకు కీలకమని అన్నారు. ఖచ్చితమైన మరియు నాణ్యమైన సమాచారం సేకరించడం ద్వారా ప్రభుత్వానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణంలోని వివిధ సచివాలయాల నుంచి ఎన్యూమరేటర్లు మరియు పురపాలక కార్యాలయం నుండి సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## సేవతోనే ఉన్నతస్థితి సాధ్యం: ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 13:** సమాజ సేవతోనే ఉన్నత స్థితి లభిస్తుందని, సేవా మార్గంలో నడవాలని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీ నివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం, పెద తాడేపల్లి రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం శ్రీ కీర్తిశేషులు ఈతకోట సత్యనారాయణ, అప్పాయమ్మ దంపతుల సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాతాజీ కుటుంబం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగా ఈరోజు తాతాజీ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శ్రీనివాస గోడౌన్స వద్ద చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమన్నారు. వేసవిలో ప్రజల దాహం తీర్చే విధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలంటే
దైవానుగ్రహం ఉండాలని, తాతాజీని ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈతకోట తాతాజీ, నరిసే సోమేశ్వర రావు,ఆకాశపు స్వామి, వర్తనపల్లి కాశి, చాపల రమేష్, పుల్ల బాబి, మద్దాల మణికుమార్, పై బోయిన వెంకటరమణయ్య, బైన పాలపు ముఖేష్, మట్ట రామకృష్ణ, సూరపనేని శ్రీనివాస్, గట్టం నాని, అడబాల మురళి,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతినీ ఘనంగా నిర్వహించాలి.. ఎంపీడీవో కుమార్..



**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రియల్ 13:**ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం మంగళవారం అంబేద్కర్ జయంతి వేడుకలు ను మండలం లోని అన్ని పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయంలలో ఘనంగా నిర్వహించాలి అని ఎంపీడీవో కుమార్ తెలిపారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ లో ఈ కార్యక్రమాలు జరగాలని అడ్డతీగల ఎంపీడీవో ,పంచాయతీ ప్రత్యేక అధికారి కుమార్ తెలిపారు. సచివాలయం సిబ్బంది అందరూ తప్పనిసరిగా హాజరై బాబా సాహెబ్ అంబేద్కర్ కు నివాళలు అర్పించాలని, తమ కార్యాలయ సిబ్బందికి ,పంచాయతీ సిబ్బందికి ఎంపీడీవో కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆదిరెడ్డితనిఖీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13**
పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన పరిశీలించి వైద్యసేవల స్థితిగతులపై ఆరా తీశారు.
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటూ, ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.
సిటీ స్కాన్, ఎక్స్‌రే, ఓపీ, ఇతర కీలక విభాగాలను పరిశీలించిన ఎమ్మెల్యే పేషెంట్లకు అందుతున్న సేవలపై అధికారులను ప్రశ్నించారు. సదుపాయాలు మెరుగుపర్చాలని, పరికరాలు పనిచేసేలా చూడాలని, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రభుత్వ ఆసుపత్రి పేదలకు ప్రాణాధారమని ఇక్కడికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందేలా చూడటం బాధ్యతని వైద్యులకు సూచించారు. వైద్యసేవల్లో నిర్లక్ష్యం, అలసత్వం సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉందని, ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. కూటమి నాయకులు, వైద్యులు ఆయన వెంట ఉన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మన బాధ్యత ఫౌండేషన్ రక్తదానం.







**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 13:-** నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్ 135 జయంతి సందర్భంగా గోకవరం మండలం, కొత్తపల్లి గ్రామంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మన బాధ్యత ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గారా అజయ్ కుమార్ మాట్లాడుతూ
ఫౌండేషన్ ద్వారా అన్ని ప్రాంతాల్లో నిరంతరం సేవా అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం అని ఈ రోజు పోతల విజయ్ సారథ్యంలో కొత్తపల్లి అంబేద్కర్ యూత్ సహకారంతో రాజమండ్రి సంజీవని బ్లడ్ సెంటర్ ద్వారా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసాం అన్నారు.పోతల విజయ్ మాట్లాడుతూ రక్త కొరత తీవ్రంగా ఉన్న సమయంలో అందరికీ స్ఫూర్తిని ఇచ్చేలా అంబేద్కర్ జయంతి నాడు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది అన్నారు. రక్తదాతలను అభినంధించి,సర్టిఫికెట్స్ అందించారు.
ఈ కార్యక్రమంలో కొత్తపల్లి అంబేద్కర్ యూత్ సభ్యులు శ్రీనివాస్ కళ్యాణ్,కార్తీక్,పండు,సూరిబాబు సంజీవని బ్లడ్ బ్యాంక్ మేనేజర్ ప్రకాష్,సిబ్బంది మేఘన, పాల్ తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడి దొంగగా అవతారమెత్తిన యువకుడు...







**అడ్డతీగల,పెన్ పవర్, ఏప్రియల్ 13:** అడ్డతీగల మండలం, పాపంపేట గ్రామ సమీపంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం, ఆదివారం అడ్డతీగల సీఐ బి. నరసింహమూర్తి ఎస్సై బి. వినోద్ వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అటుగా వస్తున్న మోటార్ సైకిల్ 'ఏపీ 05 ఏ ఎన్ 3681'ను ఆపి తనిఖీ చేసిన అనంతరం ,ఆ వ్యక్తిని ప్రశ్నించగా అతను రంపచోడవరం సబ్ డివిజన్, పోలవరం జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 13 ఇంటి దొంగతనాలు చేసినట్లు తానంతట తాను ఒప్పుకున్నాడని ,సిఐ నరసింహమూర్తి తెలిపారు. మజ్జి. శివప్రసాద్ అనే ఈ వ్యక్తి ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం గ్రామం దిబ్బల పాలెం కు చెందిన వ్యక్తిగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ముద్దాయి క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడి దాదాపు నాలుగు లక్షల రూపాయల వరకు పోగొట్టుకొని ,దీనితో దొంగగా అవతారం ఎత్తి ఉదయం సమయంలో మోటార్ సైకిల్ పై గ్రామాలలో రెక్కీ నిర్వహించి ,తాళాలు వెయ్యకుండా ఉన్న ఇళ్లను, తాళాలు గుమ్మాలకు తగిలించి ఉన్న ఇళ్లను, ఎంచుకొని చక చక్యంగా దొంగతనానికి పాల్పడేవాడని పోలీసులు తెలిపారు. ఇతని వద్దనుండి సుమారు 12 లక్షల రూపాయలు విలువచేసే బంగారం, 1,50,000 విలువచేసే వెండి వస్తువులను అతని వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే అడ్డతీగల, జడ్డంగి, రాజవొమ్మంగి, వై. రామవరం, గంగవరం, రంపచోడవరం , మారేడుమిల్లి పోలీస్ స్టేషన్లలో ఇతనిపై కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ముద్దాయి నీ ఇతని వద్ద స్వాధీనం చేసుకున్న సొత్తును జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అడ్డతీగల లో హాజరు పరుస్తామని, అడ్డతీగల సీఐ నరసింహమూర్తి తెలిపారు. ముద్దాయిని పట్టుకోవడం లో మరియు చోరీ సొత్తు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన అడ్డతీగల సీఐ బి. నరసింహమూర్తి ,ఎస్సై వినోద్ కానిస్టేబుళ్లు కే .రాంబాబు, దుర్గాప్రసాద్, బి .సురేంద్ర లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# కలెక్టర్ ఆదేశానుసారం మెడికల్ క్యాంప్ నిర్వహణ



**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్,ఏప్రిల్ 13 :** పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ ఆదేశానుసారం సింగన్న కోటలో సోమవారం మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం రంపచోడవరం డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి.సరిత ఆధ్వర్యంలో గుర్తేడు మండలం, పాత కోట పంచాయతీ సింగన్న కోటలో మెడికల్ క్యాంపు సోమవారం నిర్వహించడం జరిగిందని తెలిపారు. 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో గుర్తేడు పీహెచ్సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారని తెలిపారు.

# మా బాధలు అర్థం చేసుకోండి.. దయచేసి సహకరించండి.

ట్రాన్స్కో సిబ్బంది అష్ట కష్టాలు.



**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 13:-** రాత్రి కాదు పగలు కదా వానైనా కాదు ఎండైనా తుఫాన్ అయినా చలైన నిరంతర ప్రజా సేవలోనే మగ్గుతున్న ట్రాన్స్కో సిబ్బందిని అర్థం చేసుకొని సహకరించాలని సంబంధిత సిబ్బంది బాధలు చూస్తున్నవారు కోరుతున్నారు. అర్ధరాత్రి 12 దాటింది ఫోన్ మోగింది అవతల నుండి హాలో ఎవరు సార్ మా వీధిలో కరెంటు లేదు మీరు ఏమి చేస్తున్నారు అంటూ దగ్గరగా ఒక వ్యక్తి కేకలు వినిపించాయి చూస్తాం సార్ విషయం తెలియలేదు అంటూ ఆగ మేఘాల మీద పరుగులు తీసుకుంటూ లైన్మెన్ వస్తాడు సమస్య ఎక్కడుందో గుర్తించడానికి చీకటిలో ప్రయాణం చేస్తాడు అక్కడ ఏమి జరిగినా ఆ కుటుంబానికి దిక్కెవరు ఇది ఎవరు ఆలోచించరు సమయానికి కరెంటు ఇవ్వలేక పోతున్నారంటూ వారిపై చిందులు తొక్కుతున్న ప్రజలు. ఇది అక్కడ ఎక్కడ కాదు ప్రతి గ్రామంలోనూ ఎదురవుతున్న సమస్య వర్షాకాలం ఎండాకాలం చెట్లు వాగులు వంకలు ఏదో ఒకటి నిరంతరం ఆటంకం కలుగుతూనే ఉంటుంది సిబ్బంది ఆగ మేఘాల మీద పరుగులు తీస్తున్నారు అయినా ప్రజల్లో అసంతృప్తి అసహనం వీటి అన్నిటినీ ఓర్చుకుని అడుగులు వేస్తూ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న సిబ్బంది ఏపీ ట్రాన్స్కో అటువంటి ట్రాన్స్కో లో పనిచేస్తున్న లైన్మెన్ పట్ల కొంత మంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు కొంతమంది అర్థం చేసుకుంటున్నారు ఈరోజు మనం ఏ కార్యక్రమం చేపట్టిన విద్యుత్ అనేది అతి ముఖ్యమైన భాగం అటువంటి విద్యుత్ ఒక్క పూట కాదు ఒక్క ఐదు నిమిషాలు లేదు అంటే సహనాన్ని కోల్పోతున్నాం అటువంటి శాఖలో పని చేస్తున్న ట్రాన్స్కో సిబ్బంది సేవలకు ప్రతి ఒక్కరు సలాం చేయాల్సిందే గోకవరం మండలంలో రంప ఎర్రంపాలెం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం నుండి రాత్రి 12:30 వరకు విద్యుత్ సిబ్బంది వంటి చేత్తో గోకవరం ఏఈ సుబ్రహ్మణ్యం చూచనలు మేరకు యుద్ధ ప్రాతిపదికన అంతరాయాలు అధిగమించి ప్రజలకు విద్యుత్ అందించారు, అలాంటి వాళ్ళ సేవను గుర్తించక పోయినా పర్వాలేదు కానీ విమర్శించవద్దంటూ కోరుకుంటున్నారు. కొంతమంది పరిస్థితి అర్థం చేసుకోక సోషల్ మీడియా వేదికగా చురకలాంటిస్తున్నావాళ్ళు ఉన్నారు. అర్ధరాత్రి 10 గంటల సమయంలో ఒకే ఒక్కడు దట్టమైన చీకటిలో విద్యుత్ స్తంభం ఎక్కి గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం కష్టపడుతున్న తీరు చూస్తుంటే అయ్యో అనిపిస్తుంది కానీ ఈ విషయం అర్థం చేసుకొని మరికొంతమంది ఏమైపోయారు ఈ సిబ్బంది అంటూ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు ఇలాంటి సందర్భంలో కూడా విద్యుత్ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేయకుండా వారి సేవలను వినియోగించుకోవాలని పలువురు కోరుతున్నారు.

# టిడిపి మహిళా కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 13 :--** గోకవరం మండలం కృష్ణుని పాలెం గ్రామపంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన టిడిపి మహిళా కార్యకర్త అడ్డాల బాపనమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే,టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ. సామాన్య కార్యకర్తనైనా ,పెద్ద నాయకుడినైనా ఒకే విధంగా సమయాన్ని కేటాయించి, వారి యోగక్షేమాల కొరకు అహర్నిశలు శ్రమించే నాయకుడు జ్యోతుల నెహ్రూ అని ఇక్కడ సందర్భం చెప్పకనే చెబుతున్నది. సోమవారం నాడు మహిళా కార్యకర్త బాపనమ్మను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే నెహ్రూ పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఇటీవల కాలంలో టిడిపి మహిళా కార్యకర్త అనారోగ్యం కారణంగా రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నదని స్థానిక నాయకులు కన్నబాబు ద్వారా తెలుసుకొని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి సూపర్డెంట్ కి ఫోన్ చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేసే విధంగా నెహ్రూ ప్రయత్నం చేశారు. మరుసటి రోజున తానే స్వయంగా కార్యకర్తను పరామర్శించి, ఆమెకు ధైర్యం నింపారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ డాక్టర్లకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, స్థానిక టిడిపి నాయకులు జగ్గంపేట అభివృద్ధి కమిటీ డైరెక్టర్, గోకవరం క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు,సిద్ధ సురేష్ పాల్గొన్నారు

# మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతోత్సవాలు.






**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 13 :--** ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో బాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అల్లాడి అరుణ అన్నారు. గోకవరంలోనే మండల మహిళా సమైక్య కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్135 వ జయంతోత్సవాలు నిర్వహించారు.స్వయం సహాయక సంఘాలు వార్షిక ప్రణాళిక జీవనోపాదులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని లో భాగంగా ఈ అవగాహన శిక్షణ తరగతులు ఏర్పాటు చేయగా ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి జయంతోత్సవాలు నిర్వహించారు.
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవాలలో మండల ఏపిఎం జయంతి రాజ్, గంగవరం మండలం ఏపిఎం బత్తిన అప్పలకొండ,సీసీ లు నిర్మల్ కుమార్, సత్యనారాయణ, అకౌంటెంట్ అనూష వివో ఏలు ప్రమీల, మాధురి, సరోజినీ, వెంకటలక్ష్మ మీరాబాయి, వసంత పలువురు మహిళా సమైక్య సభ్యులు ఈ శిక్షణా తరగతులలో పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్ ని అభినందించిన పిహెచ్సి సిబ్బంది



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 13:** తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేయుచున్న జి.వెంకటేష్ బాబు తూర్పు గోదావరి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ ల అసోసియేషన్ కి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తాళ్లపూడి పి.హెచ్.సి సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరావు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించి, తాళ్లపూడి పి.హెచ్.సి కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

- ఈ నెల 15వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటలకు ఐటిడిఏ చింతూరులో
- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో



**చింతూరు, పెన్ పవర్, ఏప్రిల్ 13:** పోలవరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజి.ఆర్.ఎస్) కార్యక్రమం ఈ నెల 15వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటలకు ఐటిడిఏ చింతూరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్‌కు చెందిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు మరియు వినతులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు తెలియజేసుకునే అవకాశం కల్పించబడింది. అందువల్ల, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన పత్రాలు, ఆధారాలతో కలిసి హాజరై ఫిర్యాదులను సమర్పించుకోవాలని కోరారు. అలాగే ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## భార్యను దారుణంగా కడతేర్చిన భర్త




**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:**వృద్ధాప్యంలో తోడుగా ఉండవలసిన భర్త ఆ వృద్ధురాలిని అతి దారుణంగా కడ తేర్చాడు. వృద్ధాప్యంలో తోడుగా తోడుగా ఆ వృద్ధుడుతన భార్య అయిన వృద్ధురాలనుకత్తితో పీక కోసి అతి కిరాతకంగా హతమార్చాడు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని రఘుదేవపురం గ్రామపంచాయతీ పరిధిలో చింతాలమ్మ గుడి వీధిలో సోమవారం మధ్యాహ్నం జరిగిన హత్య కలకలం రేపింది.కోట నూకారాజు(75) తన భార్య సుబ్బలక్ష్మిని చాకుతో పీక కోసి హతమార్చాడు. అనంతరం నూకరాజు అదే కత్తితో తన పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి వడి ఘట్టాడు. సీతానగరం ఎస్సై బి. వినయ్ ప్రతాప్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు అయిన కోట నుకారాజు కొడుకు శ్రీనివాస ఆంజనేయులు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఈ నేపథ్యంలో తండ్రి నూకరాజు మానసిక స్థితి తట్టినట్లుగా కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇదే క్రమంలో భార్య భర్తలు ఇద్దరూ కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి వెళ్లి సోమవారం కీడు బట్టలు అందుకున్నారు. ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం నూకరాజు ఉన ఉన్మాదిగమారిపోయాడు. ఇంటి తలుపులు గడియలు వేసేసి భార్యపై కిరాతకంగా గుండెలపై కూర్చుని పీక కోయడం మొదలుపెట్టాడు. ఆమె అరుపులకు పరిసర ప్రాంతాల్లోని నివాసం ఉంటున్న వారందరూ పరుగులు తీసి తలుపులు బద్దలు కొట్టేసరికే ఆమె మృతి చెందింది. దీంతో నూకరాజు అదే కత్తితో తన పీక తనే కోసుకున్నాడు. అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్సకు తరలించారు. సుబ్బలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై బి. వినయ్ ప్రతాప్ తెలిపారు. కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. వి. వి. ఎస్ మూర్తి సంఘటన స్థలానికి చేరుకుని సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

## పోలవరం జిల్లా పాత్రికేయ సంఘానికి కొత్త నాయకత్వం

- అధ్యక్షుడిగా మాసినేని చంద్రశేఖర్ ఎన్నిక



**చింతూరు, పెన్ పవర్, ఏప్రిల్ 13:**పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో జరిగిన పాత్రికేయ సంఘం జిల్లా కమిటీ తొలి సమావేశంలో ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో మాసినేని చంద్రశేఖర్ (చంటి ఆంధ్రప్రభ) ను ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు మాట్లాడుతూ, పాత్రికేయుల సమస్యల పరిష్కారమే సంఘ లక్ష్యమని స్పష్టం చేశారు. పాత్రికేయులకు ఆరోగ్య కార్డులు, బీమా సదుపాయాలు, గుర్తింపు పత్రాలు పెంపు వంటి అంశాల్లో సంఘం చేసిన కృషిని వివరించారు. కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు మాసినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ, జిల్లాలోని పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని హామీ ఇచ్చారు. జిల్లా కమిటీ సమష్టిగా పని చేస్తూ పాత్రికేయుల సంక్షేమానికి అంకితభావంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష్ దేవి, గిరిజన కమిషన్ అధ్యక్షుడు చోళ బొజ్జా రెడ్డి తదితరులు పాల్గొని కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు. పాత్రికేయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ మూర్తి, దృశ్య మాధ్యమాల జిల్లా అధ్యక్షుడిగా అడపా వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా పరిటాల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లాలోని పన్నెండు మండలాలకు చెందిన పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త కమిటీకి మద్దతు తెలిపారు.

## కొత్తగా వచ్చిన ఎస్.ఐ.ను కలసిన వైసిపిపార్టీ నాయకులు

- వైసిపిపార్టీ మండల కన్వీనర్,మాదిరెడ్డి సత్తిబాబు
- వై.సి.పి.పార్టీ మండలనాయకులు కార్యకర్తలు




**వి.ఆర్.పురం పెన్.పవర్. ఏప్రిల్.13:**ఇటీవల వి.ఆర్.పురం మండలానికి కొత్తగా వచ్చిన ఎస్.ఐ. షేక్ సాదిక్,ను సోమవారం వై.సి.పి.మండల నాయకులు మర్యాదపూర్వకంగాకలసి,వైసిపిపార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు,ఆధ్వర్యంలో ఘనంగాసాలువాతోసత్కరించి,స్వీట్లు అందించారు. వైసిపిపార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ మండలప్రజలుపిర్యాదులు చేసినప్పుడు వెంటనే స్పందించి,తగు చర్యలు చేపట్టాలని,కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ,వైస్ మండల ప్రెసిడెంట్లు బంధం రాజు,వడ్డాణపు చిన రాజారావు,ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతారావు కడుపు సాయి తది తరులు పాల్గొన్నారు.


## ఉపాధిహామీ పనులు సుస్థిర ఆస్తుల సృష్టికి దోహదం చేయాలి: కలెక్టర్ దినేష్ కుమార్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఏప్రిల్ 13:**పోలవరం జిల్లాలో ఉపాధిహామీ పనులు సుస్థిర ఆస్తుల సృష్టి లక్ష్యంగా సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో అన్ని మండలాలకు చెందిన ఏపిడీలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లా లక్ష్యం రోజుకు 90 వేల మ్యాన్ డేస్‌గా నిర్ణయించబడిందని, ఈ లక్ష్యాన్ని చేరుకునేలా శ్రామికులకు నిరంతర ఉపాధి కల్పించాలన్నారు. అలాగే నెలకు 8 లక్షల మ్యాన్ డేస్ సాధన దిశగా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు గ్రామస్థులతో చర్చించి కొత్త పనులను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రతి జాబ్ కార్డు లబ్ధిదారునికి కనీసం 125 రోజుల పని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో ఉపాధిహామీ పనులను సమర్థవంతంగా అమలు చేస్తే శ్రామికుల సంక్షేమం పెరగడంతో పాటు జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. పనుల్లో ఎక్కడైనా అక్రమాలు చోటుచేసుకుంటే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండలాల వారీగా సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ల వివరాలను సమీక్షిస్తూ పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు.ఈ సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాధ్, ఏపీడీ ఎల్. రాంబాబు, ఏపీఓలు బి. సత్యనారాయణ, ప్రకాష్, అరవాలు, సురేష్, స్వామి, మణికుమారి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.




## సింగన్న కోటలో నీటి వనరులను పరి శీలించిన అధికారులు





**వై రామవరం/ గుర్తేడు పెన్ పవర్, ఏప్రిల్ 13:** గుర్తేడు మండలం, పాతకోట పంచాయతీ సింగన్న కోటలో సోమవారం మండల అధికారులు నీటి వనరులను పరిశీలించారు.

గత వారంలో పోలవరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు అందరూ పాతకోట పంచాయతీ సింగన్న కోటలో క్యాంపు నిర్వహించారు. గ్రామస్తులందరూ నాడు మంచినీటి,రహదారి సౌకర్యం ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఆరోజు కలెక్టరు ఇచ్చిన హామీ మేరకు సోమవారం మెడికల్ క్యాంపు నిర్వహించి, నీటి వనరులను పరిశీలించడం జరిగిందని అధికారులు తెలిపారు. గ్రామస్తులందరూ జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలియజేశారు. నీటి వనరులు పరిశీలించడానికి వెళ్లే నీతి అయోగ్ ఏబీఎఫ్ లవన్ రెడ్డి ఉప్పర గోతులు గాటి లో బైక్ అదుపుతప్పి ప్రమాదంలో గాయపడ్డారని అధికారులు తెలిపారు. గుర్తేడు పీహెచ్సీ లో ప్రాథమిక చికిత్స చేయించుకొని, సింగన్న కోటలో జల వనరులను పరిశీలించడానికి వెళ్లడం విశేషమని తెలిపారు. ఉద్యోగం అంకితభావంతో పనిచేయడంతో ఆయనను పలువురు అభినందించారు. ఏబీఎఫ్ తో పాటు, ఆర్డబ్ల్యూఎస్ అధికారి, గ్రామస్తులు పాల్గొన్నారు అని తెలిపారు.

## హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహణ



**రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:**పోలవరం జిల్లా గంగవరం పోలీసు స్టేషన్ పరిధిలో హెల్మెట్ ధారణ మరియు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం స్థానిక వై జంక్షన్ లో అడ్డతీగల సీఐ బి. నరసింహమూర్తి, గంగవరం ఎస్సై వెంకయ్య ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రహదారి ప్రమాదాల నివారణలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

అలాగే ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వేగ పరిమితులు పాటించాలని పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి భద్రతా నియమాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వాహనదారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల సాధనే లక్ష్యం:







**ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బా రావు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఏప్రిల్ 13:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బా రావు పేర్కొన్నారు. సోమవారం పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం లో నిర్వహించిన జిల్లా కమిటీ తొలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్వహిస్తూ అనేక సమస్యలను పరిష్కరించుకున్న ఘనత తమ యూనియన్‌దేనని తెలిపారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించడంతో పాటు అక్రిడేషన్‌ల పెంపు కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చినట్టు వెల్లడించారు. అలాగే జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించడం కోసం ఇటీవల విజయవాడలో జరిగిన ఐజిఎల్ ప్లీనరీలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు.కొత్తగా ఏర్పడిన జిల్లా కమిటీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, రాష్ట్ర కమిటీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష్ దేవి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి శాసనసభలో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. నిజాలను నిర్భయంగా వెలికి తీస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ చోళ బొజ్జి రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. ఎస్టి కమిషన్ సభ్యురాలు గొర్లే సునీత కూడా జర్నలిస్టుల సేవలను ప్రశంసిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్, విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ తదితరులు కూడా మాట్లాడుతూ జర్నలిస్టులకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మాసినేని చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ మూర్తి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా అడపా వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా పరిటాల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులను రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు తదితరులు ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. స్వాతి ప్రసాద్, ఎం. శ్రీరామమూర్తి, రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పార్థసారథి, యూనియన్ నాయకులు దూరాని, ఎ. వెంకటరావు, ఎం.ఎన్.వి. ప్రసాద్‌తో పాటు జిల్లాలోని 12 మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.



# జలధారపై గ్రామసభ సమావేశం

- మండల అభివృద్ధి,అధికారి ఇమ్మానుయేలు
- జనసేనఅధ్యక్షులు ములకాలసాయికృష్ణ
- టిడిపిపార్టీఅధ్యక్షులుబొర్రా నరేష్ కుమార్




**వి.ఆర్.పురం పెన్. పవర్. ఏప్రిల్.13:**మండలంలోని వడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద సోమవారం మండల అభివృద్ధి (ప్రత్యేక)అధికారి ఇమ్మానుయేలుఅధ్యక్షతనలో సాగునీటిభద్రత,సాగు నీటి సంఘాలబాధ్యతజల ధారపైగ్రామ సభ సమావేశం నిర్వహించడంజరిగింది. జలదార కార్యక్రమంలోఎంపీడీవో ఇమ్మానియేల్,జనసేన మండలఅధ్యక్షులు ములకాలసాయికృష్ణ,టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోటను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన,కార్యక్రమంలో అధికారులు,ప్రజలు,నాయకులు అందరూ భాగస్వామ్యం అవ్వాలని,సమిష్టి కృషితో మండలంలో నీటి నిల్వలు పెంచాలని,రెండవ పంట పండించే విధంగా రైతులకు సహకారం అందించాలని, కోరారు.వడ్డిగూడెం పంచాయతీలో నీటి సమస్యలు, డ్రైనేజీ,రహదారులు,అనేక సమస్యలపై తగు చర్యలు చేపట్టి,సమస్యలు లేకుండా చేస్తామని,అన్నారు.అభివృద్ధి విషయానికి వస్తే,మా కూటమి ప్రభుత్వం,ఉప ముఖ్యమం త్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి,పవన్ కళ్యాణ్ నేతృత్వం లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నో మార్పులు చేశారని,చివరి స్థానంలో ఉన్న పంచాయతీరాజ్ శాఖను దేశంలోనే మొట్టమొదటి స్థానా నికి తీసుకొచ్చిన,ఘనత పవన్ కళ్యాణ్ దేఅంటూ కొని యాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధి కారి పాముల ప్రసాద్,కూటమి నాయకులు,ప్రజా ప్రతి నిధులు,సచివాలయసిబ్బంది.గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో టీడీపీ నుంచి వైఎస్ఆర్సీపీ లోకి చేరికలు

- జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు.






**రావులపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 13:**రావులపాలెం సోమసుందర్ రెడ్డి నగర్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా చేరిన కార్యకర్తలు కూటమి ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే పార్టీ మారినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ మానుపాటి పోసి, అజయ్, ఏడుకొండలు, కోసూరి వంశీ, కావడి అనిల్, సునీల్, ఈతకోట శివ, ఖలీద్ తదితరులు కలిపి సుమారు 50 మంది పార్టీ లోకి చేరినట్లు తెలిపారు.అలాగే సోమసుందర్ రెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా స్థూపాన్ని ఆవిష్కరించి, జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

కార్యక్రమానికి ముందు వైఎస్ఆర్ యూత్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చిర్ల జగ్గిరెడ్డి, పాటి శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు

# పోగొట్టుకున్న 7 సెల్‌ఫోన్లు రికవరీ -- యజమానులకు అప్పగించిన పోలీసులు



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 13**:రావులపాలెం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అందజేశారు.ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో వివిధ సందర్భాల్లో పోయిన మొత్తం 7 మొబైల్ ఫోన్లను పోలీస్ సిబ్బంది శ్రమతో గుర్తించి యజమానులకు తిరిగి అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు పోలీసుల పనితీరుపై సంతోషం వ్యక్తం చేశారు.సి ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేకపోతే సెర్ పోర్టల్ ద్వారా నమోదు చేస్తే ట్రేసింగ్ సులభమవుతుందని తెలిపారు.ఈ ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన ఎ ఎస్ ఐ డి.ఎస్. స్వామిని సి ఐ అభినందించారు.

# ఈనెల 18న భారీ ఉద్యోగ మేళా



**రామచంద్రపురం, పెన్ పవర్, ఏప్రిల్ 13:**నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 18వ తేదీన రామచంద్రపురంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్యాలయం వెల్లడించింది.సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళాల్లో భాగంగా ఇది 41వ మేళాగా శనివారం ఉదయం 10 గంటలకు రామచంద్రపురం ఉపాధి భవన్‌లో జరగనుంది.ఈ మేళాలో అనంతపురం, పెనుగొండలో ఉన్న ప్రముఖ కియా సంస్థతో పాటు అనుబంధ సంస్థలైన ఎస్‌జెజి వికాస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నారు. డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన 30 సంవత్సరాల లోపు పురుష అభ్యర్థులకు నెలకు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు జీతంతో పాటు ఉచిత భోజనం, రవాణా సదుపాయాలు కల్పించబడతాయి.అదేవిధంగా రామచంద్రపురంలోని గోదావరి సోలార్ కంపెనీలో టెలికాలర్, మార్కెటింగ్ ఉద్యోగాల కోసం కూడా ఇంటర్వ్యూలు జరుగుతాయి. 18 నుంచి 30 సంవత్సరాల లోపు మహిళలకు టెలికాలర్ పోస్టులు, పురుషులకు మార్కెటింగ్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి. వీటికి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఉండగా, మార్కెటింగ్ సిబ్బందికి అనుభవాన్ని బట్టి అదనపు వేతనం లభిస్తుంది. అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కోరారు. మరిన్ని వివరాలకు 9515481671 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# సనాతన ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత.

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 13:** సనాతన ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు.గత ప్రభుత్వ హయాంలో విజయనగరం జిల్లా, రామతీర్థం గ్రామంలో నీలాచలం కొండమీద గల శ్రీ కోదండరామస్వామి, శ్రీ సీతమ్మ అమ్మవారు, శ్రీ లక్ష్మణ స్వామి వార్ల విగ్రహాలను ధ్వంసం చేయడం జరిగింది.

దీంతో కూటమి ప్రభుత్వం వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆ విగ్రహాలను డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కోటిపల్లిలోని పవిత్ర గోదావరి నదిలో జలాధివాసం (నిమజ్జనం) చేయుటకు నిర్ణయించింది.నిమజ్జనానికి బయలుదేరిన రథం సోమవారం మధ్యాహ్నం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆ విగ్రహాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మాట్లాడుతూ దీనిద్వారా కూటమి ప్రభుత్వం సనాతన ధర్మ పరిరక్షణకు, ఆలయాల పునరుద్ధరణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తేటతెల్లమవుతుందన్నారు.

శ్రీరాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి



- ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 27న ఆందోళనలు
- సార్వత్రిక ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 13;**దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మండల యానిమేటర్ల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం ఎంపీడీఓ ఏ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్షురాలు జొన్నాడ అనంత లక్ష్మీ, కార్యదర్శి బూసి కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు యానిమేటర్లకు రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని, వేతనం బకాయిలు వెంటనే చెల్లించాలని, 60 యేళ్ళు దాటిన యానిమేటర్లు అందరికి కనీస పింఛన్ సౌకర్యం కల్పించాలని, డ్వాక్రా మహిళలకు రూ పది లక్షల వరకూ వడ్డీ రాయితీలు చెల్లించాలని, పొదుపు మహిళల గ్రూప్ ఇన్సూరెన్స్ వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. అలాగే గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం సత్వరమే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వెలుగు యానిమేటర్ల సమాఖ్య పిలుపు మేరకు ఈనెల 27న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# జగ్గంపేట అన్నా క్యాంటీన్ లో అన్నదానం చేసిన నాగేంద్ర చౌదరి



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 13:** స్థానిక ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా ప్రతి సోమవారం పేదలకు ఉచితంగా అన్నదానం నిర్వహిస్తున్నారు. టిడిపి యువనేత, భారతీయ ధర్మ పరిషత్ కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి కి అన్నవరం దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులైన సందర్భంలో ఈ వారం ఆయన ఆర్థిక సహాయంతో 500 మందికి ఉచితంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, మా నాయకులు ఆశీస్సులతో నాకు అన్నవరం బోర్డు సభ్యుడుగా నియమించిన సందర్భంగా 500 మందికి అన్నదానం నిర్వహించామన్నారు. జ్యోతుల నెహ్రూ స్ఫూర్తితో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు అనేకం చేస్తున్నానని పేదవారికి ఆకలి తీర్చుటలో వచ్చే ఆనందం మరుపు రానిదని వచ్చేవారం ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభించేశీదుకు చర్యలు తీసుకుంటున్నారని నాగేంద్ర చౌదరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, శీను మణిబాబు జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, వేములకొండ జోగారావు, పీలా మహేష్, బద్ది సురేష్, నాగిరెడ్డి అనిల్, వాన శక్తి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.